క్లుప్తంగా

'దేవలోక్' భూములను రద్దు చేయాలి



టీటీడీ పరిపాలన భవనం ఎదుట ధర్నా చేస్తున్న చింతామోహన్, కాంగ్రెస్ నాయకులు

తిరుపతి(అలిపిరి): 'దేవలోక్'కు కేటాయించిన భూములను రద్దు చేసి టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాల కోసం పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక టీటీడీ పరిపాలనా భవనం ఎదుట మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్ ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ, టీటీడీలో రూ.100 కోట్ల ముడుపుల విషయంలో నిగ్గు తేల్చాలని.. డిప్యూటేషన్ విధానాలకు టీటీడీలో స్వస్తి పలకాలని.. ఉద్యోగులకే ప్రమోషన్లు ఇచ్చి మంచి పోస్టులు ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అప్పట్లో అమలు చేసిన ప్రతి మంగళవారం ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శనాన్ని పునరుద్ధరించాలని కోరారు. వీఐపీ బ్రేక్ దర్శనాలను అమ్ముకునే పెద్ద దొంగలను పట్టుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రవి, గోపి గౌడ్, శాంతి యాదవ్, తేజోవతి, ముని శోభ, రావణ్, వెంకటేష్ గౌడ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య ప్రణాళిక ముఖ్యం

పాకాల : తరగతిలో ఉపాధ్యాయుడు చెప్పే పాఠాలకు సంబంధించి ముందస్తు ప్రణాళిక ఉండాలని ఎంఈఓ బాబ్జి అన్నారు. మంగళవారం బందార్లపల్లె ఎంపీయూపీ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. అనంతరం టీచర్లతో మాట్లాడారు. ఉపాధ్యాయులు పాఠాలలోని ముఖ్యాంశాలను రాసుకుని విద్యార్థులు గుర్తుంచుకునేలా విద్యాబోధన చేయాలని సూచించారు. హెచ్ఎంలు పాఠశాలల్లో ఉపాధ్యాయులకు ఒక టైం టేబుల్, విద్యార్థులకు ఒక టైం టేబుల్ ఏర్పాటు చేసి నోటీస్ బోర్డులో ఉంచాలన్నారు. మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సుభద్ర, ఉపాధ్యాయులు మెరీనా, రామనాథం, సీఆర్పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

1 నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు గురించి మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

తిరుపతి గాంధీ రోడ్: సెప్టెంబర్ 1వ తేదీ నుంచి పార్టీ సభ్యత్వ నమోదును చురుగ్గా చేయాలని తిరుపతి అసెంబ్లీ కన్వీనర్ అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. పార్టీ సభ్యత్వ నమోదుపై మంగళవారం సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. కేంద్ర కమిటీ సూచనల మేరకు పాత సభ్యత్వాలన్నీ రద్దు చేసి, పండుగ వాతావరణంలో కొత్త సభ్యత్వాలు చేయాలని కోరారు. పార్టీ శ్రేణులంతా పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గుండాల గోపీనాథ్, డాక్టర్ శ్రీహరిరావు, జనార్దన్ రెడ్డి, విజయ్ కుమార్, టి. సుబ్రహ్మణ్యం రెడ్డి, బాల, భాస్కర్ రెడ్డి, బాబు, కవిత పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత ఇండియా పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, అధికారులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం డ్రగ్స్ రహిత ఇండియా పోస్టర్లను ఎస్వీయూ వీసీ డాక్టర్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ, విద్యాలయాల్లో డ్రగ్స్, మద్యం, ధూమపానం వంటి మత్తుపదార్థాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వర్సిటీ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో 'డ్రగ్స్ రహిత ఇండియా' అంశంపై ఈనెల 29న వక్తృత్వపోటీలు, 30న క్విజ్, 31న ర్యాలీ నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ చంద్రాయుడు, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్లు దామోదరం, డాక్టర్ హరికృష్ణ, పలు కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

శ్రీరామలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

తిరుపతి సిటీ: స్థానిక కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో ఆ సంస్థ డైరెక్టర్ మన్నెం అరవింద్‌కుమార్ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది దాదాపు 120 యూనిట్ల రక్తదానం చేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ కే.జయచంద్ర మాట్లాడుతూ, డైరెక్టర్ జన్మదినం పురస్కరించుకుని సామాజిక స్పృహతో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు, ఉద్యోగులు స్వచ్ఛందంగా రక్తదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. రక్తదానం చేసిన వారిని అరవింద్‌కుమార్ అభినందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సిబ్బంది చక్రి, శ్రీధర్, విజయశ్రీ, హరికృష్ణ, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మానవ సమాజానికి మచ్చ



కోల్‌కతాలో పీజీ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఉదంతం మానవ సమాజానికి మచ్చలాంటిది. ఈ ఘటన తర్వాత వైద్యుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఆస్పత్రుల్లో మహిళా వైద్యులు, సిబ్బంది నిర్భయంగా విధులు నిర్వర్తించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. 24 గంటలు పనిచేసే పీహెచ్‌సీల్లో రాత్రి వేళ స్టాఫ్ నర్సు ఒక్కరే విధులు నిర్వర్తిస్తుంటారు. అలాంటి పరిస్థితుల్లో ఏమైనా జరిగే అవకాశం ఉంది. కాబట్టి ఆస్పత్రులకు పోలీసు భద్రతా కల్పించాలి.

– డాక్టర్ ఉదయ్ కుమార్, ప్రధాన వైద్యాధికారి, వరదయ్యపాళెం పీహెచ్‌సీ



చట్టాలను కఠినతరం చేయాలి



కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేయడం ఆందోళన కలిగిస్తోంది. మహిళల భద్రతకు పెను ముప్పుగా కనిపిస్తోంది. వైద్యులు, వైద్య సిబ్బంది రక్షణకు కఠినతరమైన చట్టాలను తీసుకురావాలి. పీహెచ్‌సీలో వైద్యం కోసం వచ్చే రోగులు, వారి బంధువుల నుంచి మేము కూడా తరచూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఇలాంటి వారిని కఠినంగా శిక్షించాలి.

– డాక్టర్ గిరిజా ప్రకాశం, వైద్యాధికారి, పీహెచ్‌సీ, ఏర్పేడు

ఇంకెంత కాలం ఎన్నికల కోడ్..?





మంగళం ఆరోగ్య కేంద్రంపై ఉన్న శిలాఫలకాలపై, రణధీర్‌పురం పంచాయతీలో అభివృద్ధి శిలాఫలకాలపై తొలగించని ముసుగులు

- కూటమి ప్రభుత్వం ఏర్పడి నెలలవుతున్నా తొలగని ముసుగులు
- అభివృద్ధిని స్వాగతించలేకే శిలాఫలకాలపై ఇంకా ముసుగులు
- పంచాయతీ అధికారుల తీరుపై మండిపడుతున్న ప్రజలు

తిరుపతి మంగళం: ఎక్కడైనా ఎన్నికల సమయంలో ఎన్నికల కోడ్ అమలు చేస్తారు. నేతల విగ్రహాలు, అభివృద్ధి శిలాఫలకాలు కనిపించకుండా రాష్ట్ర ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు వాటికి ముసుగులు వేయడం, ఎన్నికలు ముగిశాక వాటిని తొలగించడం పరిపాటి. సహజంగా ఇది ఎక్కడైనా జరిగేదే. అయితే దీనికి భిన్నంగా చంద్రగిరి నియోజకవర్గం మంగళం పంచాయతీలో ఎన్నికల కోడ్ ఇప్పటికీ ఉండటం ప్రజలను ఆశ్చర్యచకితుల్ని చేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు అవుతున్నా మంగళంలోని సప్తగిరినగర్, రణధీర్‌పురం, మంగళం, తిరుమలనగర్ పంచాయతీలలో ఇంకా ఎన్నికల కోడ్‌ను కొనసాగిస్తూనే ఉండటంపై విమర్శలొస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి సహకారంతో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేక చంద్రగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే పులివర్తి నాని అనుచరులు వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులు, దౌర్జన్యాలు చేయడం, ఇళ్లు కూల్చడం, ఆస్తుల విధ్వంసం, అభివృద్ధి శిలాఫలకాలను ధ్వంసం చేస్తూ పేట్రేగిపోవడం విదితమే. ఇక, పంచాయతీలలోని సచివాలయాలు, ఆరోగ్య కేంద్రాలు, ధ్యాన మందిరాలపై ఉన్న వైఎస్సార్, వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిల పేర్లు కనిపించకుండా ఇప్పటికీ శిలాఫలకాలపై ముసుగులను అలానే ఉంచారు. ఎన్నికలు ముగిసిన వెంటనే ఆయా పంచాయతీల కార్యదర్శులు ఎక్కడెక్కడ ముసుగులు వేశారో వాటిని తొలగించాల్సి ఉండగా, మంగళం పంచాయతీల కార్యదర్శులు మాత్రం వాటిని పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అటు మార్గంలో వెళ్లే ప్రజలు శిలాఫలకాలపై ముసుగులు తొలగించకుండా వ్యవహరిస్తున్న పంచాయతీ అధికారుల తీరుపై మండిపడుతున్నారు. పంచాయతీలలో కళ్లకు కట్టినట్టు కనిపిస్తున్న అభివృద్ధికి ముసుగులు వేయగలరా? అనే చర్చకు తావిచ్చింది.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే ముసుగులు

రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో జరగనంతగా చంద్రగిరి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అభివృద్ధి చేశారు. గత 40 ఏళ్లలో ఎన్నడూ చూడని అభివృద్ధిని మంగళం పంచాయతీల ప్రజలు చూశారు. అయితే చెవిరెడ్డి చేసిన అభివృద్ధిని ఎమ్మెల్యే నానితో పాటు టీడీపీ నాయకులు ఓర్వలేక, మంగళం పంచాయతీలలోని అభివృద్ధి శిలా ఫలకాలపై ముసుగులు తొలగించనీయకుండా స్టిక్కర్లు వేసి కప్పి ఉంచారు. దానికి తోడు అభివృద్ధి శిలాఫలకాలపై ఉన్న పేర్లను కూడ తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అభివృద్ధి ఎవరూ చేసినా స్వాగతించి, అంతకు మించి అభివృద్ధి చేసేందుకు ప్రయత్నం చేయాలేగానీ కక్షపూరిత చర్యలకు పాల్పడడం ఏమిటని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు.





మంగళం సప్తగిరినగర్ గ్రామ పంచాయతీలో భవనాలపై ఉన్న శిలాఫలకాలపై తొలగించని ముసుగులు

తపాలా బిళ్లలు సేకరించే విద్యార్థులకు ఉపకార వేతనాలు

తిరుపతి(అలిపిరి): తపాలా బిళ్లల సేకరణను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం 'దీన్ దయాళ్ స్పర్శ్ యోజన' అనే నూతన పథకాన్ని ప్రవేశ పెట్టిందని.. ఈ పథకం కింద తపాలా బిళ్లలను సేకరించే విద్యార్థులకు ఉపకార వేతనాలు మంజూరు చేయనున్నట్లు సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ నరసప్ప విలేకరులకు తెలిపారు. చదువుల్లో ప్రతిభ కనబరుస్తూ స్టాంపులు సేకరించే 6, 7, 8, 9 తరగతి విద్యార్థులకు ఈ ఉపకార వేతనాలు ఇవ్వనున్నట్టు చెప్పారు. గుర్తింపు పొందిన పాఠశాలలో విద్యార్థి 6 నుంచి తొమ్మిదో తరగతి చదువుతూ ఉండాలన్నారు. పాఠశాలలో ఫిలాటెలీ క్లబ్‌లో సభ్యుడిగా ఉండాలన్నారు. ఒకవేళ ఆ పాఠశాలలో ఫిలాటెలీ క్లబ్ లేకుంటే ఆ విద్యార్థి తన వ్యక్తిగత ఫిలాటెలీ డిపాజిట్ అకౌంట్ కలిగి ఉండాలని, విద్యార్థి కనీసం 60 శాతం ఉత్తీర్ణత సాధించి ఉండాలని.. తత్సమాన గ్రేడ్‌పాయింట్లు కలిగి ఉండాలన్నారు. తిరుపతి ప్రధాన తపాలా కార్యాలయంలో వచ్చే నెల 30న ఫిలాటెలీ రాత క్విజ్ నిర్వహిస్తామని, దీనికి రానున్న 16వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. అలాగే ఈ క్విజ్‌లో అర్హత సాధించిన విద్యార్థులు 15 రోజుల్లోపు ప్రాజెక్టు సమర్పించాలన్నారు. కరెంట్ అఫైర్స్, హిస్టరీ, సైన్సు, స్పోర్ట్స్, కల్చర్, జియోగ్రఫీ, ఫిలాటలీ (లోకల్ – నేషనల్) సబ్జెక్టుల నుంచి రాత క్విజ్ పోటీలు ఉంటాయన్నారు. అలాగే 4 నుంచి 5 పేజీలు మించకుండా ప్రాజెక్టు సమర్పించాలని.. ప్రాజెక్ట్‌లో 16 స్టాంపులు, 500 పదాలకు మించకూడదని తెలిపారు. నెలకు రూ.500 చొప్పున సంవత్సరానికి రూ.6 వేలు ఉపకార వేతనం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. విజేతలకు నగదును విద్యార్థి తల్లిదండ్రుల ఉమ్మడి పోస్టల్ ఖాతాలో జమ చేస్తామన్నారు. మరింత సమాచారం కోసం సమీపంలోని తపాలా కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

కాలువలు, రోడ్లపై చెత్త వేస్తే జరిమానా



మురుగు కాలువలో చెత్త ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న నగర కమిషనర్ మౌర్య

- ఆకస్మిక తనిఖీల్లో మున్సిపల్ కమిషనర్ ఆదేశం

తిరుపతి తుడా: నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం తెల్లవారుజామున మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎన్. మౌర్య ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గురువారెడ్డి సమాధుల సమీపంలోని మస్టర్ పాయింట్ వద్ద ముఖ ఆధారిత హాజరును పరిశీలించారు. ఆలస్యంగా విధులకు హాజరయ్యే వారిపై చర్యలు తీసుకోవాలని హెల్త్‌ఆఫీసర్‌ను ఆదేశించారు. అనంతరం నగరంలోని వైఎస్ఆర్ మార్గం, లక్ష్మీపురం కూడలి, ఎయిర్ బైపాస్ రోడ్డు, ఎంఆర్.పల్లె పోలీస్ స్టేషన్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్యం పనులను పరిశీలించారు. నగరంలో రోడ్లపైన, కాలువల్లో చెత్త వేసేవారిని గుర్తించి జరిమానా విధించాలని ఆదేశించారు. ఖాళీ స్థలాల్లో ఉన్న చెత్త తొలగించాలని యజమానులకు నోటీసులు ఇచ్చినా స్పందించకపోతే సిబ్బందే తొలగించి, వారికి అపరాధ రుసుం విధించి వసూలు చేయాలన్నారు. మురుగు కాలువల్లో వ్యర్థాల తొలగింపు పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, డీఈ. సంజయ్ కుమార్, హెల్త్‌ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, డీసీపీ శ్రీనివాసులు రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి, టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

గడువులోపు ఫిర్యాదులు పరిష్కరించకపోతే చర్యలు

తిరుపతి తుడా: 'మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో ప్రజలు ఇచ్చే ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేసి, పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థ సమావేశం మందిరంలో అన్ని విభాగాల అధికారులతో మీ కోసం..అర్జీలపై సమీక్షించారు. ప్రభుత్వం పీజీఆర్ఎస్‌పై ప్రత్యేక దృష్టి సారించిందని, నిర్దేశిత గడువులోపు ఫిర్యాదులను పరిష్కరించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏదైనా అదనపు సమాచారం అవసరమైతే అర్జీదారులని ఫోన్‌లో సంప్రదించాలని, ఫిర్యాదు పరిష్కారానికి ఎంత సమయం పడుతుందో వారికి తెలియజేస్తే ప్రజలకు మనపై నమ్మకం కలుగుతుందన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్‌తేజ్ రెడ్డి, అదనపు కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ ఆఫీసర్లు సేతుమాధవ్, కేఎల్ వర్మ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, డీసీపీ శ్రీనివాసరెడ్డి, మేనేజర్ చిట్టిబాబు, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అగ్రకుల పెత్తందార్ల నుంచి దళితున్ని రక్షించండి



ఆక్రమిత భూమిని పరిశీలిస్తున్న దళిత నాయకులు, రెవెన్యూ అధికారులు

భాకరాపేట : అగ్రకుల పెత్తందార్ల నుంచి దళితునికి రక్షణ కల్పించాలని రాష్ట్ర విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్, ఎంఆర్‌పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి వరదరాజులు డిమాండ్ చేశారు. చిన్నగొట్టిగల్లు మండలం ఎగవూరు పంచాయతీ ముడువగుంట్ల మాదిగపల్లెకు చెందిన దళితుడి భూమిని రెవెన్యూ అధికారులతో కలసి మంగళవారం సర్వే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, దిగువూరు రెవెన్యూ గ్రామంలోని సర్వే నంబర్ 7/3 లో 1.70 సెంట్ల భూమిలోకి అదే రెవెన్యూ గ్రామానికి చెందిన అగ్రకుల పెద్దలు దళితునికి భూమిలోకి ప్రవేశించి దళితులను బెదిరించడం సరికాదన్నారు. రెవెన్యూ అధికారులు వచ్చి భూమి కొలతలు వేసి పరిష్కరించకుండా మరో వారానికి వాయిదా వేయడం ఏమిటని ప్రశ్నించారు. దళితుడు రామచంద్రయ్యకు న్యాయం చేయకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు దాసరి చంద్ర, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గురుశంకరప్రసాద్, దాసరి రాంబాబు, గోపాలయ్య, ఆదినారాయణ, పరంధామయ్య, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రామచంద్రాపురం: మండలంలోని కమ్మకండ్రిగ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. హెచ్ఎం వాగ్దేవి మాట్లాడుతూ, ఈ నెల 29న గిడుగు వెంకట రామమూర్తి జయంతి పురస్కరించుకుని నిర్వహిస్తున్న తెలుగు భాషోత్సవాలలో భాగంగా విద్యార్థులకు తెలుగు భాష ప్రాధాన్యత అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లా అధ్యక్షులు ఉమామహేశ్వర్ మాట్లాడుతూ, విజేతలకు 29న నిర్వహించే కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విశ్వనాధం, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



తుమ్మలగుంట కల్యాణ వెంకన్న ఆలయం వద్ద ఉట్లోత్సవంలో యువత సందడి

- కోలాహలంగా ఉట్లోత్సవం

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఏడాది కూడా కృష్ణాష్టమి వేడుకలు అట్టహాసంగా జరిగాయి. తొలుత ఉదయం ఆలయంలోని ఉత్సవమూర్తులను రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుని అలంకరణలో ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీకృష్ణునికి ప్రీతికరమైన వెన్న ముద్దలు, అటుకుల పాయసం మొదలైనవి నైవేద్యంగా సమర్పించారు. ఆ తరువాత వాటిని భక్తులకు వితరణ చేశారు. అనంతరం నిర్వహించిన ఉట్లోత్సవంలో గ్రామంలోని యువతతో పాటు వేద పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పోటీ పడ్డారు. చందనం, సుగంధ ద్రవ్యాలతో కూడిన నీటిని చల్లుతూ సందడి చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నల్లందుల సుబ్రమణ్యంరెడ్డి, ఆలయ సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



చందనం నీళ్లు చల్లుకుంటున్న యువత

రూ.5కోట్ల విలువైన మఠం భూమి కబ్జా

- ఫిర్యాదు చేసినా పట్టించుకోని హథీరాంజీ మఠం, ప్రభుత్వ అధికారులు



ఆందోళన చేస్తున్న శ్రీ హథీరామ్ బావాజీ సంరక్షణ కమిటీ సభ్యులు

తిరుపతి అర్బన్: హథీరాంజీ భూములను కబ్జాకోరుల బారి నుంచి విముక్తి కల్పించి, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని శ్రీ హథీరామ్ బావాజీ సంరక్షణ కమిటీ గౌరవ అధ్యక్షులు గుండాల నాయక్ డిమాండ్ చేశారు. ఆక్రమణకు గురైన మఠం భూముల్లో శ్రీ హథీరామ్ బావాజీ సంరక్షణ కమిటీ సభ్యులు మంగళవారం ఆందోళన చేశారు. గుండాల నాయక్ మాట్లాడుతూ, తిరుపతి నడిబొడ్డున సాక్షాత్తు ఆర్డీఓ కార్యాలయానికి కూతవేటు దూరంలో రూ.5 కోట్ల విలువ చేసే హథీరాంజీ బాబా భూములు కబ్జాకు గురైనట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చిందని, కబ్జా చేసి దర్జాగా నిర్మాణ పనులు చేస్తున్నారని, దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. వెంటనే సర్వే నంబర్ 366/1,2,3 లలో భూ సర్వే చేసి కబ్జా చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని, లేనిపక్షంలో బిల్డింగ్ నిర్మాణం ఎదుటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కనీసం ఒక్క సెంటు భూమి కూడా బంజారా కుటుంబాలకు ఇవ్వకపోగా, మఠంతోపాటు ప్రభుత్వ అధికారులు కబ్జారాయులకు సహకరించడం శోచనీయమని నిరసించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు చలపతి నాయక్, ఉపాధ్యక్షులు శివ నాయక్, సునీల్ నాయక్ ప్రసాద్ నాయక్, బంజారా కుటుంబ సభ్యులు, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

బంగారు తిరుచ్చిపై శ్రీకృష్ణుడి చిద్విలాసం

చంద్రగిరి: శ్రీనివాసమంగాపుంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారికి అనుబంధ శ్రీకృష్ణుడు రుక్మిణీ సత్యభామ సమేతుడై మంగళవారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. స్వామివారి జన్మనక్షత్రం రోహిణి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించా రు. ఉదయం సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మ వారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. తదుపరి సాయంత్రం శ్రీరుక్మిణిసత్యభామ సమేత శ్రీకృష్ణ స్వామివారు బంగారు తిరుచ్చిపై ఆశీనులై నాలుగు మాడవీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో ఆర్జితం ఇన్స్‌పెక్టర్ ధనశేఖర్, జమేదారు చిరంజీవి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



బంగారు తిరుచ్చి భక్తులకు దర్శనమిస్తున్న రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు

ఇస్కాన్ పోటీల్లో ప్రతిభ

తిరుపతి ఎడ్యుకేషన్: శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకుని ఇస్కాన్ నిర్వహించిన వివిధ పోటీల్లో శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సర విద్యార్థినులు ప్రతిభ చాటారు. వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో 16మంది విద్యార్థినులు గెలుపొంది సత్తా చాటారు. విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులను ఇస్కాన్ అందజేసింది. ప్రతిభ చాటిన విజేతలను ప్రిన్సిపల్ డాక్టర్ సి.భువనేశ్వరి, సంస్కృత అధ్యాపకులు భవానీ ప్రసాద్, హాస్టల్ వార్డెన్ డాక్టర్ స్నేహలత అభినందించారు.



ప్రతిభ కనబరచిన విద్యార్థినులతో ప్రిన్సిపల్ తదితరులు

శ్రీవారిమెట్టు వ్యాపారస్తుల నిరసన



టీటీడీ పరిపాలన భవనం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న శ్రీవారిమెట్టు వ్యాపారులు

తిరుపతి(అలిపిరి): శ్రీవారిమెట్టు వ్యాపారులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం టీటీడీ పరిపాలన భవనం ఎదుట పొర్లు దండాలతో వినూత్న నిరసన వ్యక్తం చేశారు. అలాగే, శ్రీవారి చిత్రపటాలు తలపై పెట్టుకుని సమస్యలు నివేదించారు. కార్యక్రమంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు అంజయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్. జయచంద్ర, యుగంధర్ , చిట్టిబాబు, మల్లికార్జున, లోకనాథం, చిరంజీవి, నరసింహ, మల్లి, సోను, మొగిలప్ప, రాంబాబు, గణేష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.